# బఫే

-మధుచక్రవర్తి

సమయం... సాయంత్రం ఏడుగంటలు...

నగరం 'కాస్మొటిక్ సర్జరీ' చేయించుకున్న ప్రౌఢలా హుందాగా వుంది.

నగరం నడిబొడ్డున, నీలిరంగు 'నియాన్ లైట్ల' వెలుగుల్లో మెరిసిపోతూన్న, ఆ అయిదు నక్షత్రాల ఆధునిక హోటల్. విటుల కోసం ఎదురు చూస్తున్న ఖరీదైన వేశ్యలా వుంది.

ఆ హోటల్ ఆవరణలోని 'పేరడైజ్ లాన్' ఆ సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించబడింది.

విశాలమైన పచ్చిక ప్రదేశంలో, అక్కడక్కడా క్రమపద్ధతిలో అమర్చిన గార్డెన్ టేబుళ్లూ... కుర్చీలు...ఓ పక్కన చలువ చేసిన తెల్లటి గుడ్డలు పరిచిన పొడవాటి బల్లలూ...వాటిపైన ఉంచిన పింగాణీ పాత్రల్లో చవులూరిస్తున్న ఉత్తర, దక్షిణ భారతీయ పద్ధతుల్లో చేసిన వంటకాలతో పాటు, చైనీస్ స్టైల్లో చేసిన పలురకాల డిలీషియస్ డిషెస్...మరోపక్క స్ఫటికాల్లా మెరుస్తోన్న సీసాల్లో 'టెంప్టిం'గా ఊరిస్తున్న దేశ, విదేశీమద్యం...

## రచయిత పరిచయం

"కంగ్రాట్యులేషన్స్..యువర్‌ది షార్ట్ స్టోరీ (బఫే) అవార్డ్ ఆఫ్ ఆంధ్ర జ్యోతి...న్యూజెర్సీ కాంపిటీషన్ 1997, ప్లీజ్ అటెండ్ ద అవార్డ్ ఫంక్షన్ ఎట్ రవీంద్రభారతి, హైదరాబాద్ ఆన్ 16 ఆగస్టు 1997, ఎట్ 6.00 పి.ఎమ్...ఎడిటర్ ఆంధ్రజ్యోతి" అన్న టెలిగ్రాం చూడగానే చాలా థ్రిల్ అయ్యాను,

పత్రికారంగంలో, ఎంతో గత చరిత్ర...ఘన చరిత్ర గల్గిన 'ఆంధ్రజ్యోతి' వీక్లీలో...అందునా కథా రచనలో ఘనాపాటి అయిన శ్రీదాట్ల ధీటైన సంపాదకత్వంలో, ఈ బహుమతి రావడం, ఓ విశిష్ట పురస్కారంగా నేను భావిస్తున్నాను.

నా గురించి...

నన్ను 'మధుచక్రవర్తి' అంటారు.

పుట్టింది...ఎదిగింది...చదివింది...ఉద్యోగం చేస్తోంది అంతా విశాఖపట్నంలోనే. వైజాగ్ 'నేవల్ డాక్ యార్డ్' డిజైన్ బ్యూరోలో ఉద్యోగం...కళాప్రపూర్ణ శ్రీగణపతి అచ్యుత రామరాజుగారి, సారథ్యంలో నవనవోన్మేషంగా విలసిల్లుతూన్న 'విశాఖ సాహితి'లో కార్యవర్గ సభ్యునిగా సాహితి సేద్యం...

కథ...కవిత...పాట...నాటిక ప్రక్రియల్లో వందకు పైగా రచనలు, తెలుగులో వచ్చిన...వస్తూన్న అన్ని ప్రముఖ పత్రికలలోనూ, విశాఖ ఆకాశవాణిలోనూ, ప్రచురితం...ప్రసారితం...ఇదివరలో జ్యోతి మంత్లీ...ఉదయం వీక్లీ (పురాణం సంపాదకత్వం)లలో బహుమతుల స్వీకారం...

ఇంట్లోనూ...ఆఫీసులోనూ...ఇష్టాగోష్టుల్లోనూ సాహితి మిత్రులతో ఎడతెగని కబుర్ల కలబోత, ఓ కమ్మని కలలాంటి అనుభూతి...

లలిత కళల పట్ల విపరీతమైన మక్కువ... వెన్నెలన్నా...వెన్నెలంత చల్లని, తెల్లని మనసున్న మనుషులన్నా పడి చస్తాను.

సున్నితత్వం...భావుకత్వం నాతత్వం...

మానవతావాదం...నా వాదం...

అనాథలకూ...అభాగ్యులకూ ఏదో చెయ్యాలన్నదే నానినాదం...

చిన్నన్నాయ్ వెంకట్...చిన్నక్కాయ్ విమల, నాలోని రచయితకు ప్రేరణ అయితే, ఠాగూర్...సంజీవ్‌దేవ్‌ల రచనలు ప్రాణం...

శ్రీమతి...'రూప'. సుపుత్రుడు...'హర్ష'.

ఇదీ స్వోత్కర్ష...

ఇక చివరిగా...నాకీ బహుమతికి కారకులైన, ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి...సంపాదక వర్గానికీ...న్యూజెర్సీ తెలుగు కళా సమితి వారికీ...రామలక్ష్మీ ఫౌండేషన్ (మద్రాస్) వారికీ నాకృతజ్ఞతలు!

నమస్కారములతో

– మధు చక్రవర్తి

కనులు మూసుకుని, ఆమె ఒడి వెచ్చదనాన్ని అనుభవిస్తున్న చంద్రం, ఆమె మాటలకి కనురెప్పలు తెరిచి ఆమె కళ్లల్లోకి చూస్తూ...

"సారీ రా...రాణీ... ఇవ్వాళ మా హోటల్లో 'జి.కె. గార'నే పెద్ద ఇండస్ట్రియలిస్ట్... అతగాని ఏకైక కూతురు మాళవ్య మొట్ట మొదటి పెళ్లి రోజు సందర్భంగా, చాలా గ్రాండుగా 'బఫే' డిన్నరిచ్చాడు. చాలా 'ప్రెస్టీజియస్' పార్టీ అది. డబ్బు మంచి నీళ్ళలా ఖర్చుపెట్టాడనుకో. మా బాస్‌కి, బాగా కావలసినవాడు, అందుకే పార్టీ పూర్తయ్యే వరకూ, ఉండక తప్పింది కాదు. అసలీరోజు పార్టీలో ఆ 'జి.కె.'గారు నన్ను తెగ మెచ్చుకుని, తినమనీ, తాగమనీ ఎంత బలవంతం చేసారనుకున్నావ్? నాకా తాగుడూ తిండీ ముఖ్యమా? నువ్వు ముఖ్యమా? అందుకే ఆ పెద్దాయన బలవంతం చేసినా తప్పించుకు వచ్చేశాను. చూసావా? మన పెళ్లి రోజున నా ఈ ఆలస్యానికి కారణం మరొకరి పెళ్లి రోజన్న మాట! ఏం కోపమొచ్చిందా నందూ" అంటూ బుంగమూతి పెట్టాడు.

అతడి మాటలు విన్న రాజ్యం చలించిపోతూ...

"నీ మీద నాకెప్పుడైనా కోపమొచ్చిందా బుజ్జి నందూ... అయినా ఎందుకలా చేశావు? ఈరోజు మన పెళ్లి రోజునాడైనా, మంచి విందు భోజనం చేసి రావలసింది..." అంది ఆర్తిగా అతని తలని తన గుండెలకు పొదువుకుంటూ.

గంజిపెట్టిన నేత చీర ముతకదనం... ఆ ముతకదనంలోని మెత్తదనం అతడికి తెలుస్తూనే వుంది. కుడిచేతిని పైకెత్తి, ప్రేమగా ఆమె కుడిచెంపను నిమురుతూ...

"ఏమన్నావురా... రాణీ... ఇక్కడ నువ్వు పొద్దంతా కళ్లు చేసుకుని, నాకోసం ఎదురు చూస్తూ వుంటే... నన్ను అక్కడ విందు భోజనం, ఆరగించి రమ్మంటావా?" అంటూ, రెండు అరచేతుల్తో ఆమె ముఖాన్ని కిందికి వంచుతూ ఆమె గుండెల్లోకి గుసగుసలాడుతున్నట్టు...

"నీ కళ్లల్లోని చల్లదనం...
నీ పెదవుల్లోని తియ్యదనం...
నీ ఒడిలోని వెచ్చదనం...
నీ కౌగిలిలోని మెత్తదనం...
నీ గుండెల్లోని ప్రేమధనం...
అన్నిటినీ మించి...
అమోఘమైన, నీ ఆడతనం...

ఇలా, నా ఎదురుగా రాసులు రాసులుగా పోసి, స్వచ్ఛమైన... అచ్చమైన...అరుదైన... అతి విలువైన "బఫే డిన్నరు" నువ్వు ఇస్తుంటే... ఎక్కడ మొదలుపెట్టాలా...

ఏది ముందు రుచి చూడాలా... అద్భుతమైన, అమోఘమైన ఈ విందు ఆరగించడానికి, ఈ చిన్ని రాత్రి, అసలీ అల్పమైన జీవిత కాలం సరిపోతుందా అని, నేను 'వర్రీ' అవుతూంటే, వెర్రి మొర్రి ఆలోచనలతో విలువైన సమయాన్ని వృధా చేస్తావేంట్రా నందూ..." అంటూ మునిపంట ఆమె పెదవుల్ని అందుకున్నాడు చంద్రం.

ఆకాశాన అనంతంగా పరచుకున్న నక్షత్ర సమూహాలు మాత్రం... తమ తళుకు తళుకు అభివందనాల అక్షతలను ఆ అయిదు నక్షత్రాల హోటల్ గదిలోని, ఆగర్భ శ్రీమంతుల దంపతులపై కాక, ఈ ఆరుబయట, పాతకాలపు డాబా మీద, వెన్నెల పరదాకింద, తమ పేద గుండెల్లోని, ప్రేమ నిధుల్ని, తమకంగా, తన్మయంగా ఒకరికొకరు అర్పించుకుంటున్న ఈ ప్రేమ జంటపై వెదజల్లి, వాళ్లను అభిషిక్తుల్ని చేశాయి.

# రైలుబండి కోసం

మాధవ్, Nicosia, Cyprus.
E-Mail: madhava@mcmrb.com.cy

వెన్నెల్లాంటి అందమైన ఒక పసితనపు జ్ఞాపకం!
తాతకి ఆడుకుంటానికని అబద్ధం చెప్పి
రైలుస్టేషను అరుగుమీద కూర్చుని
వచ్చివెళ్లే రైలుబండ్లని చూసే
పసితనపు జ్ఞాపకం...

కదిలిపోయే రైలుబండినిచూసినా
ఎర్రగుడ్డ చూపించి సర్కస్‌వాడిమల్లే
అంతపెద్ద దయ్యంలాంటి రైలుబండినీ
అమాంతంగా ఆపుచేసే స్టేషన్ మాష్టర్‌నిచూసినా
ఆరాధనా భావం పొంగి పరవళ్లుతొక్కేది.

స్టేషన్ మాష్టర్ ముద్దుగా తలనిమిరి చాక్లెట్టిస్తే
విచ్చుకున్న పత్తికాయల్లాంటి కళ్లతో
ప్రపంచాన్నే జయించిన సంబరం మనసంతా ఊపేసేది.
తోటిపిల్లల కళ్లలో నన్ను హీరోనిచేసేదా రైలుబండి.

కీచుకీచుమంటూ చప్పుళ్లు చేస్తూ -
అమ్మో, ముసలితనం మీదబడ్డ మా తాతకిమల్లే
ఉసూరుమంటూన్నట్టు మెల్లగా ఆగేదా రైలుబండి.

రైలుఆగిందంటే ఆ తర్వాత జరిగే తిరనాళలాంటి సంబరం
నన్నింకా ఆశ్చర్యపరుస్తూనేవుంటుంది...
బిలబిలమంటూ పుట్టల్లోంచి బైటికొచ్చే చీమల్లాగా
మనుషులు మనుషులు కుప్పలుతెప్పలుగా మనుషులు
రైలుఆగిందంటే ఈనిందన్నట్లు లెక్కట!

"నువ్వు నాకెపుట్టావురా కన్నా.."
అని ముద్దుగా గోరుముద్దలు తినిపిస్తూ
మా అమ్మ చెప్పిందాకా
మనుషులు రైళ్లలోంచి పుడతారనీ
ఈనడంకోసమే రైలు ఆగుతుందనీ
మా భద్రిగాడు చెబితే నమ్మేసిన రోజులవి!!!

రైలుబండిని చూస్తే పసితనపు సంబరం
వెన్నెల్లాగా పరుచుకుని
రారా చిన్నోడా రారమ్మని పిలుస్తున్న జ్ఞాపకం.

-----((((()))))-----